క్లుప్తంగా

రక్తనిధి కేంద్రం సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న రక్తనిధి కేంద్రం సిబ్బంది

పాతమంచిర్యాల: రక్తనిల్వలు లేకపోవడంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో రక్తనిధి కేంద్రం సిబ్బంది బుధవారం రక్తదానం చేశారు. రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రతీ రోజు రక్తనిధి కేంద్రంలో 10యూనిట్ల రక్తాన్ని సికిల్ సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తులకు ట్రాన్స్‌విఎషన్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర రోగులకు, గర్భిణులకు కూడా రక్తం సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతీనెల 500యూనిట్ల రక్తం రక్తనిధి కేంద్రానికి అవసరమని, రక్తదాతలు ముందుకు రాకపోవడంతో రక్తనిధి కేంద్రంలో తీవ్ర కొరత ఏర్పడిందన్నారు. క్తనిల్వలు పెరగాలంటే రక్తదాతలు ముందుకు రావాలని కోరారు.

'చందా డబ్బులపై అసత్య ప్రచారం'

మంచిర్యాలక్రైం: స్థానిక పాత గర్మిళ్లలో హన్మాన్ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులు ఉత్సవాల కోసం సేకరించిన చందా డబ్బులు ఎవరూ వాడుకోలేదని, కాజేశారని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని కమిటీ సభ్యులు రామల్ల వెంకట్ రెడ్డి, ఆకెనపెల్లి మధు, ఎగ్గెన శ్రీధర్, పుప్పాల హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాములు, రవి, అశోక్, స్వామీ మరికొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

సీపీగేట్ ఫిజిక్స్‌లో శంకర్‌కు 21వ ర్యాంకు



దుర్గం శంకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దుర్గం శంకర్ సీపీగేట్ ఫిజిక్స్‌లో రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకు సాధించారు. రెబ్బెన మండలం నారాయణపూర్ వ్యవసాయ కుటుంబానికి చెందిన శంకర్‌ను బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, అధ్యాపకులు పర్వా, కిషోర్ పాల్గొన్నారు.

గ్రామపాలన అధికారుల నియామకం



జాయిన్ అవుతున్న గ్రామపాలన అధికారులు

కోటపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామపాలన అధికారుల వ్యవస్థలో భాగంగా బుధవారం కోటపల్లి మండలానికి 9క్లస్టర్‌లకు గాను 9మంది గ్రామ పాలన అధికారులను కేటాయించగా తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు తమ ఉత్తర్వు పత్రాలను అందజేసి మండలంలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవేందర్ రావు మాట్లాడుతూ.. గ్రామపాలన అధికారుల నియామకంతో ప్రజలకు సేవలు మెరుగుకానున్నాయి. రెవెన్యూ వ్యవస్థకు మంచిపేరు తీసుకొచ్చేలా గ్రామపాలన అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, అధికారులు తిరుపతి, కిషోర్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటుపై అటవీ అధికారుల పరిశీలన




విద్యుత్ స్తంభాలు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

భీమారం: మండల కేంద్రం నుంచి నర్సింగాపూర్‌లో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు అటవీశాఖ భూముల గుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే స్థలాన్ని బుధవారం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు పరిశీలించారు. అనుమతులు రాగానే పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ డీఈ రాజన్న తెలిపారు. ఇందులో అటవీశాఖతో పాటు విద్యుత్‌శాఖ ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు వేళాయె!

- బెల్లంపల్లి బల్దియాలో మూడుచోట్ల రహదారులు వెడల్పు
- రూ.8.94 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఇప్పటికే నోటీసులు జారీ చేసిన మున్సిపల్ యంత్రాంగం
- మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ



విస్తరించనున్న కాల్‌టెక్స్-కాంటా అంతర్గత ప్రధాన రహదారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆరు నెలల క్రితం రూ.8.94 కోట్లు నిధులు మంజూరు కాగా, అంతర్గత ప్రధాన రహదారితో పాటు మరోరెండు రహదారులను వెడల్పు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా ప్రాంతాల వ్యాపార, వాణిజ్య వర్గాలు, ప్రార్థన మందిరాలు, సింగరేణి, ప్రభుత్వ కార్యాలయాలు, స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న పురప్రజలకు నోటీసులు పంపారు. కాల్‌టెక్స్ రైల్వే ప్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఏఎంసీ మీదుగా కాంటా చౌరస్తా వరకు అంతర్గత ప్రధాన రహదారిని ముందస్తుగా విస్తరించనున్నారు. నిబంధనల ప్రకారం ఈ రోడ్డు మార్గంలో ఉన్న ప్రజానికానికి, ధార్మిక సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈపాటికే ఫైనల్ నోటీసులు అందించారు. అదే తీరుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (కాంటా) చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోశమ్మ గడ్డకు వెళ్లే రోడ్డు విస్తరణ కోసం ఆ ప్రాంత నిర్వాసితులకు కూడా ఫైనల్ నోటీసులు పంపించారు. పాత బస్టాండ్ వద్ద నుంచి శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాల మీదుగా అంబేడ్కర్ నగర్ చౌరస్తా వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనుల కోసం ఆ ప్రాంత ప్రజలకు తొలిదఫా నోటీసులు అందజేశారు. అయితే ఈ మార్గంలోని కొందరు రోడ్డు విస్తరించకుండా హైకోర్టుకు వెళ్లినట్లు తాజా సమాచారం. దీంతో రెండో విడత, ఫైనల్ నోటీసుల జారీకి తాత్కాలికంగా బ్రేక్ పడగా, మున్సిపల్ అధికారులు మాత్రం రోడ్డు వెడల్పు పనులపైనే ప్రధానంగా దృష్టి సారించారు. రోజుల వ్యవధిలో పనులు ప్రారంభించే యత్నాల్లో ఉన్నారు.

తొలగనున్న ఇక్కట్లు...

బొగ్గగనుల తవ్వకాలతో ఏర్పడిన బెల్లంపల్లికి వందేళ్ల చరిత్ర ఉంది. కార్మిక క్షేత్రంగా ఆవిర్భవించిన బెల్లంపల్లి క్రమక్రమంగా విస్తరించింది. ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా విలసిల్లుతోంది. అయితే ఇంత ఘనమైన చరిత్ర కలిగిన బెల్లంపల్లిలో ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా ఇన్నాళ్లుగా రోడ్డు వెడల్పు పనులు చేపట్టడానికి తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. తద్వారా రోడ్డు ఇరుకిరుకుగా ఉండి వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం రోడ్డు విస్తరణకు సిద్ధం కావడంతో పురప్రజల దృష్టి అటువైపు మళ్లింది. రోడ్డు విస్తరణ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు.

బజారు ఏరియా రోడ్డుపై మౌనం...!

అంబేడ్కర్ చౌరస్తా నుంచి బజారు ఏరియా, పాత బస్టాండ్ మీదుగా కన్నాలబస్తీ రైల్వే ప్లైఓవర్ బ్రిడ్జి వరకు ప్రధాన రహదారిని సైతం విస్తరించాలనే డిమాండ్ ఉంది. గడిచిన కొన్నాళ్ల నుంచి ఈ రోడ్డును వెడల్పు చేస్తామని మున్సిపల్ అధికారులు ప్రకటించడం, కొలతలు తీసుకొని హడావుడి చేశారు. ప్రస్తుతం మూడు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణకు రంగం సిద్ధం అవుతుండగా ముఖ్యమైన బజారుఏరియా రోడ్డు విస్తరణపై నోరు మెదపడం లేదు. విస్తరిస్తారా లేదా అనేది తేల్చకుండా నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నారనే విమర్శలు పురప్రజల నుంచి వస్తున్నాయి.

స్వరూపం ఇలా..

విస్తరించనున్న రోడ్డు	రోడ్డు వెడల్పు	నిధుల మంజూరు
కాల్‌టెక్స్ టు కాంటా చౌరస్తా అంతర్గత ప్రధాన రహదారి	100ఫీట్లు	6.70కోట్లు
కాంటా చౌరస్తా టు పోశమ్మ గడ్డ చౌరస్తా అంతర్గత రోడ్డు	60ఫీట్లు	1.12కోట్లు
పాతబస్టాండ్ టు అంబేడ్కర్ నగర్ చౌరస్తా అంతర్గత రోడ్డు	60 ఫీట్లు	1.12కోట్లు

అందరూ సహకరించాలి



ప్రజా అవసరాలకు అనుగుణంగా రోడ్లను విస్తరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ చేపట్టడానికి తగిన కార్యాచరణ సిద్ధం చేశాం. అంతర్గత ప్రధాన రహదారి, బెల్లంపల్లి బస్తీ వాసులకు ఫైనల్ నోటీసులు అందజేశాం. శిశు మందిర్ రోడ్డు ప్రజలకు ఫస్ట్ నోటీసు అందజేశాం. ఫైనల్ నోటీసులు అందించిన ప్రాంతాల్లో కొద్దిరోజుల వ్యవధిలో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభిస్తాం. ఆ తర్వాత శిశుమందిర్ రోడ్డును కూడా విస్తరిస్తాం.

– తన్నీరు రమేష్,మున్సిపల్ కమిషనర్,బెల్లంపల్లి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈవో యాదయ్య



పాఠం బోధిస్తున్న డీఈవో యాదయ్య

చెన్నూర్: పది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. స్థానిక కస్తూర్బా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీఈవో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరిగి ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం పది విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రత్యేక ప్రణాళికతో సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో దత్తకుమార్, ప్రిన్సిపాల్ సుమలత పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

- మోదీ జన్మదినం సందర్భంగా సేవ కార్యక్రమాలు
- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

జైపూర్/కోటపల్లి/మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. జైపూర్ మండలం దుబ్బపల్లి, కోటపల్లి మండలం కొండంపేట గ్రామాల్లో, మంచిర్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకల సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వరకు సేవ పక్షం కార్యశాల కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయాలని అన్నారు. రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్, మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు 75 మంది బీజేపీలో చేరగా కొమురయ్య కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శులు దుర్గం అశోక్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, కొయ్యల ఏమాజీ, అక్కల రమేష్, పెద్దపల్లి పురుషోత్తం, దుట రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఆధ్వర్యంలో కలెక్టరేట్ భవన సముదాయంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందికి జిల్లా సమగ్ర హెచ్ఐవీ, ఎస్‌టీఐ నివారణ యూనిట్(దిశ) వారిచే హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించి, అపోహలను దూరం చేయాలని తెలిపారు. అనంతరం హెచ్ఐవీకి సంబంధించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్, సీడీపీవో మనోరమ, డెమో వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో నాందేవ్, కె. వెంకటేశ్వర్లు, దిశ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ, సర్వీసెస్ అధికారి రాజేశ్ పాల్గొన్నారు.

లంబాడా హక్కుల సాధన కోసం పోరాటం

- భీమారంలో సేవాలాల్ సేనా ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్

భీమారం: లంబాడా హక్కుల సాధన కోసం సేవాలాల్ సేనా ద్వారా పోరాటం కొనసాగిస్తామని సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం సేవాలాల్ సేనా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించగా, ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో లంబాడాలు అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లవాత్ రవినాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోతు మల్లేశ్ నాయక్, నాయకులు మోహన్‌నాయక్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

'సమస్యలకు చావు పరిష్కారం కాదు'



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అనిత

శ్రీరాంపూర్: చావే సమస్యలకు పరిష్కారం కాదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత తెలిపారు. సీసీసీలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలు వచ్చినప్పుడు దానిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనవసరంగా మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యల జోలికి వెళ్లొద్దన్నారు. మానసిక వైద్య నిపుణులు మాట్లాడుతూ.. సమస్యలు వచ్చినప్పుడు కుంగుబాటు ధోరణి సరికాదని, పాజిటివ్‌గా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అప్పల ప్రసాద్, మానసిక వైద్య నిపుణులు లింగారెడ్డి, పద్మ, నాందేవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మౌనిక పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అభయ రామన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్ సంగీత విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపజయాలకు కుంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగినప్పుడే విజయావకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

- శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యం మరింత మెరుగుపర్చుకొని రాణించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో బుధవారం ఏరియా స్థాయి వార్షిక క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్‌గా ఆర్కే 7, న్యూటెక్ గ్రూప్ నిలువగా, ఆర్కే 5, ఐకే 1ఏ గ్రూప్ రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొముురయ్య, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, స్పోర్ట్స్ కార్యదర్శి పాల్‌స్రుజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో ఆర్డినేటర్ నర్సయ్య, జనరల్ కేప్టెన్ శ్రీనివాస్, వాలీబాల్ కేప్టెన్ చిన్నయ్య, క్రీడాకారులు తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో ఆదర్శంగా నిలవాలి



కాసిపేట 1గనిని సందర్శించిన జీఎం రాధాకృష్ణ

శ్రీరాంపూర్: రక్షణలో ఆదర్శంగా నిలవాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆర్కే 7 గనిపై బుధవారం నిర్వహించిన అభినందనల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో ఆర్కే 7గనికి గ్రూప్ వన్ టీంలో భూగర్భ గనుల్లో మొదటి బహుమతి సాధించింది, స్టౌవింగ్‌లో ద్వితీయ బహుమతి సాధించిందన్నారు. ఈ బహుమతులు అందుకున్న వారిని ఈ సందర్భంగా జీఎం అభినందించారు. కార్యక్రమంలో గని గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి సంతోష్ రావు, టీబీజీకేఎస్ నాయకులు వీరభద్రయ్య, కిషన్ రావు, సారయ్య, సంక్షేమ అధికారి సంతన్‌లు పాల్గొన్నారు.

కాసిపేట: రక్షణతో కూడిన ఉత్పత్తికి కార్మికులు కృషి చేయాలని ఏరియా జీఎం రాధాకృష్ణ సూచించారు. మందమర్రి ఏరియా కాసిపేట 1గనిలో బుధవారం అండర్ గ్రౌండ్‌లో పనులను పరిశీలించారు. ఉత్పత్తి లక్ష్యాలను కలిసికట్టుగా సాధించాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంటు రాంబాబు, మేనేజర్ సతీష్, రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, డెప్యూటీ మేనేజర్ వెంకటేష్, అండర్ మేనేజర్ హిమాలయ, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీశాన్, ప్రభాకర్ తదితరులున్నారు.

బొగ్గుబాయి వార్తలు

● వృత్తి కోర్సులతో ఉపాధి

శ్రీరాంపూర్: వృత్తి శిక్షణ కోర్సులతో ఉపాధి పొందవచ్చునని శ్రీరాంపూర్ ఏరియా సేవా (సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు ఉమారాణి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో పలు వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందిన 530మంది మహిళలకు ఖాదీ గ్రామోద్యోగ్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బుధవారం రాత పరీక్ష నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై అభ్యర్థులకు పరీక్ష పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీనియర్ పీవో మురళి, సింగరేణి సేవా సమితి చీఫ్ కో ఆర్డినేటర్ శివకుమార్, ఏరియా సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● కార్మికులపై పనిభారం

శ్రీరాంపూర్: ఏరియాలోని ఎస్సార్పీ 1గనిలో కార్మికులపై పనిభారం మోపుతున్నారని హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం కేంద్ర కమిటీ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చట్టవిరుద్ధంగా కార్మికులతో పనిచేయిస్తూ, వారిని శ్రమదోపిడీకి గురి చేస్తున్నారన్నారు. డిస్ట్రిబ్యూషన్ అయిన తర్వాత గని లోపలికి కార్మికులు పరికరాలు తీసుకొని వెళ్లే సమయానికి మ్యాన్‌రైడింగ్‌ను నిలిపివేస్తున్నారని, దీంతో కార్మికులు నడుచుకుంటూ లోపలికి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. ఇదేమని కార్మికులు ప్రశ్నిస్తే గని మేనేజర్ వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు



కాసిపేట: సోమగూడెంలో....



తాండూర్: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న రజకులు

ఘనంగా ఐలమ్మ వర్ధంతి

లక్సెట్టిపేట/దండేపల్లి/నెన్నెల/తాండూర్/కాసిపేట/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/పాతమంచిర్యాల: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కనబర్చిన ధైర్యసాహసాలను కొనియాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రజకులు తదితరులు పాల్గొన్నారు.




దండేపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



లక్సెట్టిపేటలో నివాళులర్పిస్తున్న రజకులు

'ఎమ్మెల్యే అండతోనే కాంగ్రెస్ నేతల గూండాయిజం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అండతోనే కాంగ్రెస్ నాయకులు గూండాయిజం చేస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌లోనే కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచే నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల గూండాయిజం పెరిగి పోయిందన్నారు. ఫలితాలు వచ్చిన నాటి నుంచే బీఆర్ఎస్‌లోని కొందరు నాయకులను టార్గెట్ చేసి మరీ దాడులకు దిగుతున్నారని తెలిపారు. గత 20 నెలల్లో జరిగిన దాడులపై పోలీస్ కమిషనర్‌తో పాటు, డీజీపీ, రాష్ట్రస్థాయిలోని అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దాడి చేసిన వారిని వదిలేసి, బీఆర్ఎస్ నాయకులు, దాడికి గురైన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. అనంతరం నస్పూర్‌లో మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరిగిన దాడిలో గాయపడి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాటం రాజును పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు.

'ఎల్లంపల్లి'కి జలకళ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్ట్‌లతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా కళకళలాడుతోంది. ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం ప్రాజెక్ట్ క్రస్ట్ లెవెల్ 148మీటర్లతో 20.175టీఎంసీల పూర్తిస్థాయి నీటి సామర్థ్యంతో ఉంది. 10గేట్లు తెరిచి 77వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

డీఎంకు వినతి

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ బుధవారం యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.